# అమ్మ

సౌరాజ్జెం ఆకాశానికేసి చూసింది.

ఆవురావురుమంటూ ఆకాశాన్నంతా తినేసి, ఆకలి తీరక కామోసు, మేఘాలు నీలిముక్క కోసం ఆరాటంగా వెదుక్కుంటున్నాయి.

సౌరాజ్జెం కళ్ళలో భయం.

"ఓలమ్మో ఎన్ని మబ్బులో" గుడిసెలోకి పరుగెత్తింది.

చీకటి - పొద్దు పొడిచింది గంట క్రితమే అయినా గుడిసె నిండా దట్టంగా అల్లుకుంటూ చీకటి.

సౌరాజ్జెం గుండెనిండా భయం గొలిపే చీకటి.

ఆ గుడిసెలో ఓ మూల పాత గుడ్డల మూటలా పడి వున్నాడు కొండడు.

రెండేళ్ళ క్రితం ఓ చిన్న గుడిశె - చిరిగిన కొన్ని పాత బట్టలు, ఎప్పటిదో పగిలిన రేకుడబ్బాలాంటి పెట్టె, అందులో కాబోయే భార్యకోసం అపురూపంగా దాచుకున్న పూసల నగలు, అక్కడక్కడా పడివుండే సత్తుగిన్నెలు - వీటితో విరాజిల్లే తన అతిచిన్న సామ్రాజ్యానికి సౌరాజ్జేన్ని రాణిని చేశాడు.

ఆల్చిప్పల్లా విశాలంగా వుండే కళ్ళు - పట్టుకుంటే జారిపోయేలా వుండే నున్నటి నిగారింపైన వళ్ళు - హాయిగా అన్పించే అందమైన నవ్వు - రూపుదిద్దుకున్న మేఘకన్యలా వుండే సౌరాజ్జెం మత్తులో కొండడికి వూపిరాడకుండా పోయింది.

సౌరాజ్జెం రాచరికంలో ఆకలికి అవకాశమే లేదు. కొండడు పగలంతా రిక్షా తొక్కుతాడు. తొమ్మిది కాకముందే గుడిసె ముందు వాలిపోతాడు.

ఆ తెచ్చిన డబ్బు చాలా జాగ్రత్తగా వాడుతుంది సారాజ్జెం. అందులోనే అన్నిరకాల రుచులూ - అన్ని రకాల సరదాలు తీర్చుకుంటుంది.

సారాజ్జేనికి కొండడిదే లోకం - కొండడికి సారాజ్జెమే లోకం.

ఆ లోకంలోకి బుల్లికొండడు ప్రవేశించాడు.

"చూడు మావా.. నీ ముక్కే బండముక్కు" అంటూ పగలబడి నవ్వుతుంది సారాజ్జెం.

"కళ్ళు నీవేనే... అరచేయంత" మురిపెంగా చూస్తాడు సారాజ్జెం వైపు.

అటువంటి కొండడికి ఐద్రోజుల్నుంచీ జ్వరం.

సారాజ్జేనికి కళ్ళనిండా నీళ్ళు పొంగుకొచ్చాయి. ఎన్నడూ కాళ్ళు నొప్పులనైనా చెప్పని కొండడు - కండలు తిరిగి బలిష్టంగా - ఆరోగ్యంగా వుండే కొండడు - ఇపుడు నిస్సహాయంగా - తోటకూర కాడలా - వడలిపోయి వున్నాడు.

మొదట మాములు జ్వరమేననుకుని కషాయం తీసిచ్చింది. రెండో రోజు వళ్ళు జ్వరంతో పేలిపోతుంటే భయమేసి గవర్నమెంట్ వారి ఆస్పత్రికి పిల్చుకెళ్ళింది.

మూడు గంటలు నిలబడ్డాక - కొండడు శోష వచ్చి పడిపోయే స్థితికి చేరుకున్నాక ఓ అరగంట తిట్టి - గొంతులో ఇన్ని రంగునీళ్ళు పోసి రెండు మాత్రలు పొట్లం కట్టి ఇచ్చారు.

"రేపటికి మాత్తర్లు బాబూ" అంటే -

"రేపు మళ్ళా రా పో - వారానికి సరిపడా ముడుపు కట్టి ఇస్తారనుకున్నావా" అని కసిరేసుకున్నారు.

జ్వరం ఏమాత్రం తగ్గుముఖం పట్టకపోతే, ఆ మురికివాడలకు దగ్గరగా, వాళ్ళ రక్తమాంసాల్తో బలిసి బ్రతుకుతున్న ఓ ప్రైవేట్ డాక్టర్ దగ్గరకు పిల్చుకెళ్ళింది. తను అతి పొదుపుగా వుండి దాచుకున్న అర్ధరూపాయి బిళ్ళలు, రూపాయి బిళ్ళలు పాతబడి నలిగిపోయిన ఒకటి రెండు రూపాయల నోట్లు వూడ్చుకుపోయినట్లు అయిపోయాయి.

సారాజ్జేనికి దిగులుగా వుంది.

ఈ రోజుకి కొండడు ఎంగిలి పడి ఐదు రోజులు. మొదట్లో కొద్దిగా జావైనా కాసిచ్చేది. ఇప్పుడు ఇంట్లో చిల్లిగవ్వ లేదు.

కొండడు తెచ్చే డబ్బు ఏ రోజుకారోజు సరిపోవడమే అంతంత మాత్రం. తను దాచుకున్న డబ్బంతా డాక్టర్ తిమింగలం మింగేసింది. చంటివాడు ఏడుస్తున్నాడు గుక్కపట్టి - ఆకలి.

సారాజ్జేనికి అపుడు ఆకలి గుర్తొచ్చింది. పొయ్యి రాజేసి అప్పటికే నలభై ఎనిమిది గంటలు దాటింది.

రెండ్రోజులు కొండడిని చూసుకోవడంలో ఆకలే గుర్తుకు రాలేదు.

కొడుకు పై కప్పు ఎగిరిపోయేలా గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

ఐదు నెలలైనా నిండలేదు వాడికి.

వెళ్ళి ఒక్కసారిగా చాపమీద వాడి ప్రక్కన వాలిపోయింది.

వాడిని కౌగిలించుకుని భోరుమని ఏడ్చేసింది.

నోటికి రొమ్ము అందించింది. కొద్దిసేపటికి ఏడుపు ఆపాడు. తన ప్రాణాల్ని తోడేస్తున్నట్లు చీకుతున్నాడు.

పెద్దగా ఉరుము ఉరిమింది. తళుక్కుమని వెలుగు.

చల్లటి గాలి గుడిసెలోకి దూరి తన శాడిస్టిక్ ఆనందాన్ని అనుభవిస్తోంది.

సారాజ్జెం కొడుకువైపు చూసింది. వాడు నిద్రపోతున్నాడు. కంటి పక్కగా చారలు కట్టిన కన్నీళ్ళు- పెదవుల కొసలనుంచి చొంగతోపాటు కారుతున్న ఓ పాలచుక్క.

లేచి కొండడి దగ్గరగా వచ్చింది.

కొండడు వణుకుతున్నాడు గజగజ....

సారాజ్జెం తన పాతచీరలన్నీ తెచ్చి కొండడికి కప్పింది.

ఈరోజైనా కొండడికి కొద్దిగా జావకాసిద్దామన్న కోరిక సారాజ్జెంలో...

తడిక దగ్గరగా వేసి ఆ చుట్టుపక్కల అన్ని గుడిసెలకు వెళ్ళి అర్థించింది. రెండ్రూపాయ లుంటే అప్పుగా ఇవ్వమని. ఎవరిస్తారు? అందరూ కూలినాలీ చేసుకుని బ్రతికేవాళ్లే.

..చాలామంది గుడిసెల్లో ఆకలి ప్రస్ఫుటంగా కనిపించింది సొరాజ్జేనికి.

నిరాశగా - నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ వస్తున్న సొరాజ్జేన్ని పలకరించింది నాగమణి.

ఉలికిపడి తలయెత్తింది సొరాజ్జెం.

గడపమీద కూచుని వుంది నాగమణి. శవం నవ్వినట్లు జీవంలేని నవ్వు పెదవులమీద..

అసహ్యంగా మొహం తిప్పుకుని నడక వేగం పెంచింది సొరాజ్జెం.

తనకు కొండడు చెప్పేదాక తెలియదు నాగమణి వ్యభిచారి అని - ఆ గుడిసెలో, చుట్టుపక్కల వున్నమరో రెండు గుడిసెల్లో జరిగేది అదే వ్యాపారం అని.

తనెంత అమాయకురాలు ! మొదట్లో నాగమణి నవ్వుతూ పలకరిస్తే తనూ పలకరించేది.

నాగమణికి పాతికేళ్లుంటాయి. ఎటొచ్చి పెళ్ళి చేసుకోలేదు. గుడిసెలో ఒక్కతే వుంటుంది.

ఇంతే తెల్సిన సొరాజ్జెం నాగమణితో కలుపుగోలుగా మాట్లాడేది. రెండుమూడుసార్లు నాగమణి తమ ఇంటికి కూడా వచ్చింది.

కొండడికావిషయం తెల్సి మండిపడ్డాడు.

"సంపేత్తాను దాంతో మాటాడితే - అదేంటనుకున్నావ్, ఎబిచారి - ఎర్రిమొగమా, సంసారుల్లో దూరిందంటే కొంపలార్పిపోద్ది"

అప్పటినుండి నాగమణి పల్కరించినా, తను ముఖం తిప్పేసుకుని వచ్చేసేది.

ఎంతటి అసహ్యమైన స్త్రీ! ఏ కూలోనాలో చేసుకుని బ్రతకవచ్చుకదా.. ఇంత నీచమైన కూడు తినకపోతేనేం.. ఛీ. అంతకన్నా ఆకలితో చావడమే నయం.

ఆలోచించుకుంటూ నడుస్తున్న సొరాజ్జేనికి, తన మావకు రిక్షా అద్దెకిచ్చే ఓనర్ గుర్తొచ్చాడు.

నల్లగా పొట్టిగా బానపొట్టతో వుంటాడు. దట్టంగా పెంచిన మీసాలు పైకి మెలేసి గ్లాస్కో లాల్చీ తొడుక్కుని - సిగరెట్ కాలుస్తూ..

"ఓరేయ్ దొంగ నా కొడకా... రిచ్చా ఇలా చేసి తెచ్చావేంరా" అనో "నిన్నటి అద్దె డబ్బేదిరా - నీ బాబుగాడి ముల్లె వుందనుకున్నావా - అద్దిచ్చి బండట్టుకుపో" అనో తిడ్తూ వుంటాడు.

సారాజ్జెంలో ఆశ - ఇలాంటి పరిస్థితిని వివరిస్తే కరగని మనుషులుకూడా వుంటారా - సారాజ్జెనికి ధైర్యం వచ్చింది.

వర్షం ప్రారంభమైంది. గుడిసెలోంచి వర్షం చాలాచోట్ల ధారగా కారుతోంది.

కొండడిని, పసివాడిని పొడిగా వుండే మూలకి జరిపింది. చిరుగులు పడిన పాత గోనెసంచి దులిపి దాన్ని నెత్తిమీద వేసుకుంది.

ఓ రెండు ఫర్లాంగులు నడిస్తే చాలు - రిక్షా ఓనర్ మల్లయ్య ఇల్లు వస్తుంది.

కొంత దూరం వడివడిగా నడిచిన సారాజ్జెం - అప్పటికే ముద్దగా తడిసిపోయింది. వర్షం అవిశ్రాంతంగా - కసిగా, కోపంగా కురుస్తోంది. చలి వెన్నులోంచి తన్నుకొస్తోంది. ఇక ఆగలేక సారాజ్జెం పరుగెత్తడం ప్రారంభించింది.

ఎదురుగా ఏముందో కన్పించనంత విపరీతమైన వర్షం.

సంధించిన బాణంలా పరుగెత్తుతోంది సారాజ్జెం. కసిగా నేలని బాదుతూ - నీళ్ళని ఛేదిస్తూ..

మల్లయ్య ఇంటిని చేరుకున్నాకే ఆగింది.

తలుపు మెల్లగా తట్టింది. "అయ్యా, అయ్యా" అంటూ దైన్యం నిండిన గొంతుతో పిల్చింది. ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లు స్వరం -

"బాబుగోరూ" ఈసారి కొద్దిగా గట్టిగా తలుపుల్ని బాదింది.

"ఎవరూ" అనే స్వరంతోపాటు తలుపు తెరుచుకుంది.

ఎదురుగా మల్లయ్య.

"ఎవరూ" మళ్ళీ అడిగాడు గడప దగ్గిర నిలబడ్డ సొరాజ్జెన్ని ఎగాదిగా చూసి -

"నేనయ్యా కొండడి పెళ్ళాన్ని" గొంతులో కొద్దిగా వణుకు.

'ఏటయిందే కొండడికి - రిచ్చాకోసం రాకపోతే ఏటో అయిందనే అనుకున్నా'

మల్లయ్య గొంతులో ధ్వనించిన ఆదుర్దా ముత్యపు జల్లులా వుంది.

"జొరం బాబు... మాయదారి జొరం ఆడ్ని పీల్చి పిప్పి సేసేసింది. ఇంట్లో పైసా కూడా లేదు. రెండ్రోజులుగా ఆడికేమీ పెట్నేదు. మీరు దరమ పెబువులు - అందుకే లగెత్తుకొచ్చినా. ఓ రెండ్రూపాయలు అరువివ్వండి సామీ - ఇన్ని నూకలెత్తి ఆడికి గంజి కాసిస్తా" ఆశగా చూసింది మలయ్యవైపు.

హమ్మయ్య సీరియస్ కేసుకాదు - ఆకలి కేస్ - ఓస్ అనుకున్నాడు మల్లయ్య అప్రయత్నంగా మీసం మెలేస్తూ.

"నా వాల్లు ఆపదలో వుంటే అరువేమిటి? ఆ మాత్తరం సాయం సేయకపోతే మనిషి మాత్తరం దేనికి - రా లోపలికి" అన్నాడు.

సొరాజ్జెం లోపలికెళ్ళింది. మల్లయ్య సొరాజ్జెంవైపు చూశాడు.

తడిసిన చీరలోంచి శరీరం నగ్నంగా కన్పిస్తున్నట్లు - రొమ్ములు కళ్ళలో పొడుస్తున్నట్లు

మల్లయ్య కళ్ళల్లో ఎర్ర జీరలు -

"పదిరూపాయలు సాలా" అన్నాడు ఆకలిగా చూస్తూ..

"అంత తీర్సలేం బాబు, రెండు సాలు" కళ్ళనిండా కృతజ్ఞత నింపుకుని అంది సొరాజ్జెం.

"తీర్సక్కరలా, వుంచుకో"

పదిరూపాయలనోటు సొరాజ్జెం చేతిలో పెట్టి గుప్పెటమూసి బలంగా తనవైపుకు లాక్కున్నాడు.

బయట ఎక్కడో ఉరిమింది - భయంకరంగా.

సారాజ్జెం గుప్పిటలో పదిరూపాయలు నలుగుతోంది. మల్లయ్య చేతిలో సారాజ్జెం గుప్పిట నలుగుతోంది.

అసహ్యం, భయం, తిరస్కారంతోపాటు సారాజ్జేనికి నీరసం వచ్చేస్తోంది.

సారాజ్జెం రొమ్ము నలుగుతోంది కర్కశంగా - సారాజ్జెం మనసు నలుగుతోంది.

ఒక్కసారిగా తల విదిల్చి పెదవులకోసం వెదుక్కుంటున్న మల్లయ్య ముఖంమీద కుమ్మింది. మల్లయ్య బాధగా అరిచాడు.

పెదవి చిట్లి రక్తం కారుతోంది. మోకాలు మడిచి కడుపులో ఫెడీమని తన్నింది. మెలికలు తిరుగుతున్నాడు మల్లయ్య.

నలిగిన పదిరూపాయల నోటు విసిరికొట్టింది. 'థూ' అని వూసింది.

ఆ వర్షంలో ఈ సారి సారాజ్జెం పరుగెత్తడం లేదు - ఆశలేదు - కోరికలేదు - బాధలేదు - విరాగిలా నడుస్తూ గుడిసె చేరుకుంది. అప్పటికి పొద్దుగూకేసింది.

☆☆☆

ఉదయం సారాజ్జెంతోపాటు ఆకలికూడా నిద్రలేచింది.

మొదట కొండడి వళ్ళు తాకిచూసింది - చల్లగా వుంది.

హమ్మయ్య అనుకుంది. తన కొండడికి జ్వరం తగ్గిపోయింది.

"ఎలా వుంది మావా" అని అడిగింది.

"ఆకలిగా వుందే" అన్నాడు కొండడు. ఆకలి.. ఆకలి.. ఆకలి..

సారాజ్జెం సంబరాన్ని క్షణంలో ఆకలి తినేసింది.

బైట వర్షం ఆగకుండా కురుస్తోంది.

ఇంకెవర్ని అడగాలి? చుట్టుపక్కల అందర్నీ అడిగింది. అయినా ఈ వర్షంలో ఎవరికైనా ఏం పని దొరుకుతుంది?

సారాజ్జేనికి నాగమణి గుర్తొచ్చింది. తను అసహ్యించుకుని తప్పించుకు తిరిగినా, నవ్వుతూ పలకరించే నాగమణి -

ఇపుడు ఏ ముఖం పెట్టుకుని నాగమణి దగ్గరకెళ్తుంది?

మొహం చెల్లలేదు సారాజ్జేనికి

బాబునెత్తుకుని కొండడి తలదగ్గర కూచుండిపోయింది.

మధ్యాహ్నం దాటిపోయింది. అరగంటకోసారి కొండడు ఆకలంటూ అడుగుతుంటే గుండె తరుక్కుపోతుంది.

బాబుని కొండడి పక్కన పడుకోబెట్టి ఓ నిశ్చయానికొచ్చి లేచింది.

కొండడికి తెలిస్తే చంపేస్తాడని తెల్సు. కొండడి ఆకలి తీరాక తనని చంపినా పర్లేదు.

నాగమణి ఇంటికి వర్షంలో తడుస్తూ పరుగెత్తింది.

స్నేహంగా ఆహ్వానించింది నాగమణి. ప్రేమగా మాట్లాడింది.

"ఈ వర్షంలో తలుపుతడితే ఎవుడో పాసింజరనుకున్నా" కళ్లలో నిరాశ తళుక్కున మెరిసి మాయమైంది.

సారాజ్జెం అంతా చెప్పింది.

"ఇన్ని నూకలుంటే ఇయ్యక్కా. ఆడికైనా ఆకలి తీరుద్ది" ప్రాధేయపడ్తున్నట్లు అడిగింది.

నాగమణి పేలవంగా నవ్వింది.

"ఈ వర్షంలో గిరాకీలేమొస్తాయి. రెంఢ్రోజుల్నుంచి ఒక్క సన్నాసీ రాలేదు. నేనింత వండుకు తిని రెంఢ్రోజులు దాటింది" చాలా జాలిగా చూసింది నాగమణి. అపుడు గమనించింది సారాజ్జెం నాగమణి మొహంలో నీరసం - కళ్ళలో ఆకలి - మనసులో ఆవేదన -

సారాజ్జెం కళ్ళల్లో నీళ్ళు -

"ఇంతమాత్రానికే ఏడ్వాలా - నీవు నన్ను మనసారా అక్కా అని పిలిచావు. నీకోసం ఏమీ చేయలేని అసమర్థురాల్ని కాదు. ఇక్కడే కూచుని వుండు. ఓ పది నిమిషాల్లో

వచ్చేస్తాను" అంటూ నాగమణి ఆ వర్షంలోనే బైటికి పరుగెత్తింది.

సొరాజ్జేనికి అర్థం కాలేదు. నాగమణి ఏం చేయాలనుకుంటుంది? గుడిసె తలుపుకానుకుని వర్షంలోకి చూసింది. మసక మసగ్గా నాగమణి కన్పించింది - గుడిసెలోపలికి పోతూ - అదెవరి గుడిసో అర్థమై సొరాజ్జెం అవాక్కయిపోయింది.

ఆ గుడిసె నారిగాడిది. వాణ్ణి రోజూ తను చూస్తూనే వుంటుంది. ఉదయాన్నే ఓ పదేళ్ళ అబ్బాయి వచ్చి వాణ్ణి చక్రాల బల్లమీద కూచోబెట్టుకుని అడుక్కోడానికి లాక్కెళుతుంటాడు. చక్రాల బల్ల లాగినందుకు వాడికి రోజుకు రూపాయి ఇస్తాడు నారిగాడు. నారిగాడి రెండు కాళ్ళు తొడలదాక తెగిపోయాయి ఏదో ప్రమాదంలో. దానికి తోడు వాడికి కుష్ఠువ్యాధి. విరిగిపోయిన ముక్కు, సగందాకా తెగిపడిపోయిన వ్రేళ్ళతో అసహ్యంగా వుంటాడు. వాడిచుట్టూ ఎప్పుడూ ఈగలు ముసురుతుంటాయి. మొండిచేత్తోనే వాటిని తోలుకుంటూ వుంటాడు వాడి దగ్గర భరించరానంత దుర్గంధం వస్తూ వుంటుంది. వాడు వస్తున్నాడంటేనే అందరూ అసహ్యంతో పక్కకు తప్పుకుని పోతారు.

అలాంటి నారిగాడి గుడిసెలోకి నాగమణి వెళ్ళింది.

స్తబ్దంగా నిలబడిపోయిన సొరాజ్జెం నాగమణి రాకను గమనించనే లేదు.

నాగమణి కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. అదో రకమైన తృప్తితో మొహం వెలిగిపోతోంది.

"నాకు తెల్సు - వాడు కాదనడని - కానీ చూశావా - నీవెంత అడిగినా ఇస్తానని నా వెంటపడినప్పుడు వాణ్ణి ఛీ కొట్టాను. ఈ రోజు అవసరం నాది కదా. వాడు నా మొహంమీద రెండ్రూపాయలు కొట్టాడు. పోన్లే ఈ డబ్బు నీ అవసరాలకు ఉపయోగపడితే నాకంతే చాలు' ' అంటూ నాగమణి సొరాజ్జెం చేతిలో రూపాయి నాణేలు రెండు పెట్టింది.

సొరాజ్జెం చేతులు వణుకుతున్నాయి.

"నాకోసం నారిగాడి దగ్గర ...... హయ్యో, ఎందుకిలా చేశావు? మనసుని చంపుకుని" సొరాజ్జెం బావురుమంది.

"మనసుని చంపుకుని పోలేదు. మనసారా వెళ్ళాను. ఏ తృప్తీలేని నా జీవితంలో కనీసం ఈ తృప్తి అయినా మిగలనీ. తొందరగా వెళ్ళి నూకలు కొని కొండడికి జావకాసి పెట్టు" కన్నీళ్ళు తుడిచి చెప్పింది నాగమణి.

కడుపుకింత కూడు వండిపెట్టగలిగేదే తల్లి. తన కొండడి కోసం తను ఏమీ చేయలేకపోయింది. ఈ రోజు తన కొండడికి కూడు పెడ్తున్నది తను కాదు. నాగమణి. ఎవరినయితే తన కొండడు 'కొంపలార్పుద్ది' అని ఈసడించుకున్నాడో - ఎవరినయితే తనిన్నాళ్ళూ వ్యభిచారి అని అసహ్యించుకుందో, ఆమె ఈనాడు తల్లిలా - తను కరిగిపోయినా కూసింత వెలుగునివ్వాలని తాపత్రయ పడే కొవ్వొత్తిలా - పిల్లల ఆకలి తీర్చడం కోసం ఏమైనా చేయగల దయగల అమ్మలా -

ఇప్పుడు సొరాజ్జెం అక్కడి ఆకాశంలా వుంది. భోరుమని రోధిస్తూ - ధారగా కన్నీరుకారుస్తూ -

అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి నాగమణికి నమస్కరించింది.

ఆకలి చల్లార్చే మహా ఫలవృక్షంలా - దాహం తీర్చే అనంత జలాశయంలా - నాగమణి-

కమ్మని ప్రేమనందించే అమ్మలా - కోరిన కోరికలు తీర్చే గుడిలోని అమ్మోరిలా - నాగమణి.

ఆమె వ్యభిచారి అయితేనేం - మనసున్న మనిషి.

మహోధృత కడలితరంగంలా పొర్లుకొస్తున్న కన్నీళ్ళను, ధారలుగా కురుస్తోన్న వర్షాన్ని పట్టించుకోకుండా తన గుడిసెవైపుకు పరుగెత్తుతూ అనుకుంది సొరాజ్జెం - ఇంకా మానవత్వం మనుషుల్లో చావలేదు - ఎక్కడో ఏ పతిత గుండెల్లోనో మలినపడకుండా బ్రతికే వుంది.

● ఆంధ్రభూమి మాసపత్రిక ఆగస్టు, 1995 ●